సాక్షి
ఆదిలాబాద్
బుధవారం, 9, ఆగస్టు, 2023

అడవితల్లి బిడ్డలు



సంప్రదాయబద్ధమైన ఆచార వ్యవహారాలు, భిన్న సంస్కృతి ఆదివాసీల సొంతం. నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా అడవి తల్లి బిడ్డలపై ప్రత్యేక కథనం.

8లో▸

సీఎంను కలిసిన ఎమ్మెల్యే బాపూరావు



బోథ్: సీఎం కేసీఆర్‌ను ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు మంగళవారం ప్రగతిభవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. బోథ్ మండల కేంద్రానికి రెవెన్యూ డివిజన్, ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో పాటు నేరడగొండ మండలంలోని కుప్టి ప్రాజెక్టు టెండర్ ప్రక్రియ పూర్తి చేసి త్వరగా పనులు ప్రారంభించాలని కోరినట్లు తెలిపారు.

గరిష్టం/కనిష్టం
32.0/24.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. పలుచోట్ల ఆకాశం మేఘావృతమై ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

గృహలక్ష్మి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం



కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కేంద్రంలో దరఖాస్తుదారుల సందడి

కైలాస్‌నగర్: సొంత జాగా కలిగి, తెల్లరేషన్ కార్డు ఉన్న వారికి గృహలక్ష్మి పథకం కింద ఇంటి నిర్మాణం కోసం అందించే రూ.3లక్షల సాయానికి సంబంధించి దరఖాస్తుల స్వీకరణ జిల్లాలో మంగళవారం ప్రారంభమైంది. కలెక్టరేట్‌తో పాటు జిల్లా వ్యాప్తంగా అన్ని తహసీల్దార్ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. తొలిరోజు జిల్లా వ్యాప్తంగా దరఖాస్తులు వెల్లువెత్తాయి.

మున్సిపల్‌లో 251 దరఖాస్తులు..

పట్టణంలోని వివిధ కాలనీలకు చెందిన 251 మంది తొలి రోజు దరఖాస్తు చేసుకున్నారు. ఈ నెల 10 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని కమిషనర్ ఏ.శైలజ తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం



పోటీని ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

ఆదిలాబాద్: క్రీడలు మానసికోల్లాసానికి దోహదం చేస్తాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ వీఆర్ఆర్ వరప్రసాద్ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులకు మంగళవారం క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన క్యారం పోటీలను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు శివరాం ప్రసాద్, మంజుల, దుర్గారాణి పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని ఆందోళన



ధర్నాలో పాల్గొన్న సెకండ్ ఏఎన్‌ఎంలు

కైలాస్‌నగర్: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలు మంగళవారం ఆందోళన చేపట్టారు. తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట మంగళవారం 48 గంటల ధర్నాకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్‌కుమార్ మాట్లాడుతూ, 20 ఏళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే ఆగస్టు 15 నుంచి సమ్మె చేపడుతున్నామని స్పష్టం చేశారు. ఇందులో సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశ్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిన్నన్న, తులసి, పుష్పల, శ్రీవాణి, జ్యోతి, అమృత్, అనిత, లత, సంగిత తదితరులు పాల్గొన్నారు.

ఐదు రోజులు.. 54 దరఖాస్తులు

సాక్షి, ఆదిలాబాద్: నూతన మద్యం పాలసీ (2023–25)కి సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ ఈనెల 4న ప్రారంభమైంది. ఐదు రోజులు గడుస్తున్నా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఈ ప్రక్రియ మందకొడిగా సాగుతుంది. మంచిర్యాల మినహా మిగతా మూడు జిల్లాల్లో ఇప్పటి వరకు సింగిల్ డిజిట్‌లోనే దరఖాస్తులు వచ్చాయి. మంచి రోజులు లేకపోవడంతో దరఖాస్తుదారులు సెంటిమెంట్‌గా ముందుకు రావడం లేదని భావిస్తున్నారు. ఈనెల 15వ తేదీతో అధిక మాసం ముగుస్తుందని ఆ తర్వాత మూడు రోజులు దరఖాస్తుకు అవకాశం ఉండటంతో అప్పుడు భారీగా వచ్చే అవకాశం ఉందని అబ్కారీ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

మంచిర్యాలలోనే అధికం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 192 మద్యం దుకాణాలకు గాను మంగళవారం వరకు 54 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. జిల్లాల వారీగా పరిశీలిస్తే ... మంచిర్యాలలో 43, ఆదిలాబాద్‌లో నాలుగు, ఆసిఫాబాద్‌లో 5, నిర్మల్‌లో రెండు ఉన్నాయి.

గ్రూపులుగా దరఖాస్తుకు ఆసక్తి

దరఖాస్తు ఫీజు రూ.2లక్షలు ఉండటం, నాన్ రిఫండబుల్ కావడంతో సింగిల్‌గా దరఖాస్తు చేసుకునేందుకు వెనుకాముందు అవుతున్నారు. గ్రూపుగా దరఖాస్తు సిద్ధమవుతున్నారు.



నార్నూర్ మండలం బాబేఝరి దన్నూగూడకు వాగు దాటి వెళ్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)



ఇటీవల వాగులో నుంచి తోయగూడ గ్రామానికి మృతదేహాన్ని ఎడ్లబండిలో తరలిస్తున్నారిలా..



బజార్‌హత్నూర్ మండలం దేగ్రా రోడ్డు దుస్థితి (ఫైల్)

ఆదివాసీ.. గోస

- తాగునీటికీ తిప్పలే!
- విద్య, వైద్యంలోనూ వెనుకబాటే!
- మారని అడవి బిడ్డల తలరాత
- నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం



కిలోమీటర్ దూరం నుంచి బిందెలతో నీటిని తెచ్చుకుంటున్న సుంగాపూర్‌లోని గోండుగూడ మహిళలు (ఫైల్)

కల్మషం లేని మనస్తత్వం.. ప్రకృతితో మమేకమైన జీవన విధానం ఆదివాసీల ప్రత్యేకం. అడవితల్లి ఒడిలో సేదతీరే వీరి సంస్కృతి సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు విభిన్నం. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి ఏడున్నర దశాబ్దాలు దాటినా వీరి జీవన ప్రమాణాలు మాత్రం మారని పరిస్థితి. ఇప్పటికీ విద్య, వైద్యం, తాగునీరు వంటి మౌలిక వసతులకు సైతం నోచుకోని దుస్థితి. జల్ జంగిల్ జమీన్ పోరాటాలు వీరికి నిత్యకృత్యమే. భూమి కోసం భుక్తి కోసం పోరాటం చేసినా ఇంకా పూర్తిస్థాయి ఫలితం దక్కలేదంటోంది ఆదివాసీ సమాజం. నేడు అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా కథనం. – కైలాస్‌నగర్

ఉమ్మడి జిల్లాలోని
ఐటీడీఏ పరిధిలో మండలాలు :70
ఆదివాసీ గిరిజన కుటుంబాలు : 64,988
ఆదివాసీ గిరిజన జనాభా : 4,62,761

పాలకులు మారినా అడవిబిడ్డల తలరాత మాత్రం మారడం లేదు. ప్రకృతి ప్రసాదిత ఫలాలతో జీవనం సాగిస్తున్న వీరికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందని ద్రాక్షగానే మిగులుతున్నాయి. ఆదివాసీల అభ్యున్నతి కోసం ప్రత్యేక పథకాలు అమలు చేస్తున్నామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటిస్తున్నా వారి జీవన స్థితిగతుల్లో మాత్రం ఆశించిన మార్పు రావడం లేదు. కాగితాలకే తప్ప క్షేత్రస్థాయిలో కనిపించడం లేదనే భావన ఆదివాసీల్లో వ్యక్తమవుతుంది. తెలంగాణ సర్కారు పోడు పట్టాల పంపిణీకి శ్రీకారం చుట్టినా ఇంకా పూర్తిస్థాయిలో అందలేదని పలువురు అంటున్నారు.

కనీస వసతులు కరువు..

ఐటీడీఏ పరిధిలో గల ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 170కి పైగా గూడేలకు ఇప్పటికీ విద్య, వైద్యం, తాగునీరు, రవాణ వంటి సౌకర్యాలు లేవు. గతుకులతో కూడిన మట్టిరోడ్లపైనే రాకపోకలు సాగించాలి. వాగులపై వంతెనలు లేక వర్షాకాలంలో వారి అవస్థలు వర్ణనాతీతం. వానొస్తే రోజుల తరబడి బాహ్యప్రపంచానికి దూరంగా ఉండాల్సిందే. అత్యవసర పరిస్థితుల్లో గూడేలకు 108, 104 వాహనాలు రాలేని పరిస్థితి. ఎడ్లబండ్లు, మంచాలపై రోగులను వాగులు దాటించి తీసుకెళ్లాల్సిన దుస్థితి. ఈ క్రమంలో సకాలంలో వైద్యం అందక గాలిలో కలుస్తున్న ప్రాణాలు ఎన్నో.

- వారం క్రితం బజార్‌హత్నూర్ మండలం దేగ్ర గ్రామానికి చెందిన మూడేళ్ల బాలుడు పంద్ర పరుశురాం అనారోగ్యంతో ఉండగా రోడ్డు సౌకర్యం లేక ఆసుపత్రికి ఆలస్యంగా వెళ్లడంతో మృతి చెందిన విషయం తెలిసిందే.
- గతేడాది లింగాపూర్ మండలం చోర్‌పల్లి వద్ద ఓ వైపు భారీ వర్షం.. మరోవైపు రహదారి లేక మూడు కిలోమీటర్ల మేర గర్భిణి నడుచుకుంటూ వెళ్లాల్సిన దుస్థితి. అనంతరం కుటుంబ సభ్యులు ఆమెను డోలిలో మోసుకుంటూ ఆసుపత్రికి తీసుకెళ్లారు.
- రాష్ట్రం ఏర్పాటయ్యాక ఉమ్మడి జిల్లాలో సకాలంలో వైద్యం అందక 35మంది గర్భిణులు, 23 మంది నవజాత శిశువులు, 12 మంది బాలింతలు చనిపోవడం గమనార్హం.
- పేదలకు పెద్ద దిక్కుగా ఉన్న రిమ్స్‌లో వైద్యం అందుతున్నా సూపర్ స్పెషాలిటీ సేవలు ఇంకా అందుబాటులోకి రాలేదు.
- ప్రతి గూడేనికి మిషన్ భగీరథ ద్వారా శుద్ధ జలాన్ని అందజేస్తున్నామని పాలకులు చెబుతున్నా ఇప్పటికీ అనేక గ్రామాలకు చేదబావులు, చెలిమినీరే దిక్కవుతోంది. కలుషిత నీటితో జనం వ్యాధుల బారిన పడుతున్నారు.
- పోషకాహార లోపంతో ఆదివాసీ మహిళలు, గర్భిణులు ఎక్కువగా రక్తహీనత బారిన పడుతున్నారు. ప్రసవ సమయంలో మాతాశిశు మరణాలు ఇప్పటికీ చోటు చేసుకుంటుండడం గమనార్హం.

విద్యాపరంగా ..

గిరిజనులకు నాణ్యమైన విద్య కోసం ప్రభుత్వాలు ప్రతిపాదనలు చేస్తున్నా ఆచరణలో కార్యరూపం దాల్చడం లేదు. ఐటీడీఏ ప్రాథమిక పాఠశాలలను దిశా మోడల్ స్కూల్ పథకంలో ఇంగ్లిష్ మీడియంగా మార్చాలనే ప్రతిపాదన ఇంకా పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు. ఏళ్లుగా ఉపాధ్యాయుల నియామకాలు లేక ఆశ్రమ పాఠశాలల్లో టీచర్ల కొరత వేధిస్తోంది. సీఆర్‌టీలతోనే బోధన సాగించాల్సి వస్తోంది. ఇంటర్మీడియెట్‌కు సంబంధించి కార్పొరేట్ కళాశాలల్లో చదువుకొనే పరిస్థితులు అందుబాటులోకి రాలేదు. టీటీసీ, ఏఎన్‌ఎం శిక్షణ కేంద్రాలను ఏజెన్సీ ప్రాంతాల్లో ఏర్పాటు చేసే ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి. ఉట్నూర్ కేంద్రంగా మంజూరైన గిరిజన యూనివర్సిటీ వేరే జిల్లాకు తరలివెళ్లడం గమనార్హం.

ఆగని ఆదివాసీల పోరాటం

ఏజెన్సీ ప్రాంతంలో 1/70, పెసా చట్టాలను అధికారులు ఉల్లంఘించి అన్యాయం చేస్తున్నారంటూ ఆదివాసీలు ఇటీవల పలుమార్లు ఆందోళనలు చేపట్టారు. జిల్లా పంచాయతీ అధికారి, కలెక్టర్‌కు వినతిపత్రాలు సైతం అందజేశారు.

విద్య, వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ



ఆదివాసీ గిరిజనులకు మెరుగైన వైద్యమందించేందుకు ఐటీడీఏ ద్వారా ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. ఆరోగ్యపరంగా ఇబ్బంది తలెత్తకుండా ఏఎన్‌ఎంలను పూర్తి స్థాయిలో నియమించాం. రిమ్స్‌లో గిరిజన ప్రత్యేక విభాగాన్ని 24/7 అందుబాటులోకి తీసుకువచ్చాం. అలాగే అత్యవసర పరిస్థితుల్లో మెరుగైన వైద్యం కోసం అంబులెన్స్‌ను సైతం అందుబాటులో ఉంచాం. ఆశ్రమ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందించేలా టీచర్లకు రెండు నెలల పాటు శిక్షణ ఇచ్చాం. సబ్జెక్టుల వారీగా బోధనకు ఇబ్బంది లేకుండా సీఆర్‌టీలను నియమించాం. పీవీటీజీ, కోలాం తెగలకు సీసీడీపీ ద్వారా విద్య, వ్యవసాయానికి ఆర్థికంగా చేయూతనందించాం. 150 మంది కొలాంలకు పక్కా గృహాలు సైతం నిర్మించి ఇచ్చాం. ఆదివాసీల సంక్షేమం, అభివృద్ధి కోసం ఐటీడీఏ ద్వారా అవసరమైన చేయూత అందిస్తూ వారికి అండగా నిలుస్తాం.
– చాహత్ బాజ్‌పాయ్, ఐటీడీఏ పీవో

చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి



ఆదివాసీల సంక్షేమం కోసం రాజ్యాంగం కల్పించిన చట్టాలను పకడ్బందీగా అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. 1/70, పెసా చట్టాలకు ఏజెన్సీ ప్రాంతంలో తూట్లు పొడుస్తున్నారు. దీంతో ఆదివాసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. విద్య, వైద్యం, రవాణ పరంగా గూడేలకు సరైన సదుపాయాలు లేవు. ఇటీవల జారీ చేసిన ఆర్‌ఓఎఫ్‌ఆర్ హక్కుపత్రాల్లోనూ అనేక పొరపాట్లు జరిగాయి. ఆదివాసీలకు మేలు చేసేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడితే తప్ప ప్రయోజనం చేకూరదు.
– గోడం గణేశ్, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు

నేటి నుంచి ‘బీసీ’ చెక్కుల పంపిణీ

- కలెక్టర్ రాహుల్‌రాజ్



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: జిల్లాలోని బీసీ కులవృత్తుల వారికి రూ.లక్ష ఆర్థిక సాయం చెక్కులను బుధవారం నుంచి పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం సాయంత్రం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,జిల్లాలోని ఆయా బీసీ కులవృత్తుల వారికి రూ.లక్షసాయం చెక్కులను నియోజకవర్గ కేంద్రాల్లో ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల సమక్షంలో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గానికి 300 మంది చొప్పున అందజేయనున్నట్లు చెప్పారు. బోథ్ నియోజకవర్గంలో బుధవారం, ఆదిలాబాద్ నియోజకవర్గంలోని లబ్ధిదారులకు గురువారం ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవోలు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.

ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ చర్యలు

అనంతరం ఎన్నికల సెక్టోరల్ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. రానున్న ఎన్నికలను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందులో అదనపు కలెక్టర్లు కుష్బూ గుప్తా, శ్యామలాదేవి, జెడ్పీ సీఈవో గణపతి, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, డీఈవో ప్రణీత, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు నలంద ప్రియ తదితరులు పాల్గొన్నారు.

రెస్క్యూ బృందాలతో అవగాహన..

ఆదిలాబాద్‌రూరల్: నది పరీవాహక ప్రాంతాల్లో నివాసం ఉండే ప్రజలు వరద ముంపునకు గురైన సమయంలో వారి ప్రాణాలను రక్షించేందుకు ఆయా ప్రాంతాల్లోని గజ ఈతగాళ్లకు రెస్క్యూ బృందం ద్వారా అవగాహన కల్పించనున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. మావలలోని హరితవనం పార్క్‌లో గల చెరువులో అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో వరదలో చిక్కుకున్న వారిని ఎలా రక్షించాలనే అంశంపై మంగళవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి కేశవులు, అదనపు ఫైర్ అధికారి గోవర్ధన్‌రెడ్డి, సెక్షన్ అధికారి శివాజీ, మావల తహసీల్దార్ ఆరిఫా సుల్తానా, తదితరులున్నారు.

మా ఇష్టం.. నచ్చినబడికే వెళ్తాం!

- 'సర్దుబాటు'ను లెక్కచేయని పలువురు ఉపాధ్యాయులు
- డీఈవో ఆదేశాలు బేఖాతరు

ఆదిలాబాద్‌టౌన్: విద్యాశాఖలో కొంతమంది అధికారులు, ఉపాధ్యాయులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. డీఈవో ఆదేశాలు సైతం బేఖాతరు చేస్తున్నారు. టీచర్ల సర్దుబాటు ప్రక్రియలో భాగంగా కేటాయించిన పాఠశాలలకు వెళ్లకుండా కొంతమంది ఇష్టారాజ్యంగావ్యవహరిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల ద్వారా అధికారులపై ఒత్తిడి తీసుకొస్తూ నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. ఇచ్చోడ మండలంలోని తలమద్రి జెడ్పీఎస్ఎస్‌లో ఇద్దరు విద్యార్థులకు గాను ఆరుగురు ఉపాధ్యాయులు ఉండటంతో 'సాక్షి'లో వచ్చిన కథనానికి డీఈవో స్పందించారు. అందులో నలుగురిని ఇతర పాఠశాలలకు సర్దుబాటు చేశారు. అయితే జెడ్పీఎస్ఎస్ కేశవపట్నంకు సర్దుబాటు చేసిన ఉపాధ్యాయుడు ఆ పాఠశాలకు వెళ్లకుండా ఇచ్చోడ మండలకేంద్రంలోని పాఠశాలకు వెలుతున్నాడు. అలాగే నార్నూర్ మండలంలోని లోకారికి చెందిన ఓ ఉపాధ్యాయురాలిని ఇటీవల జిల్లా కేంద్రంలోని స్పోర్ట్స్ స్కూల్‌కు డిప్యూటేషన్‌పై పంపారు. అక్కడ విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటంతో విద్యాశాఖ అధికారులు ఆమె డిప్యూటేషన్ రద్దు చేశారు. తిరిగి ఆమె పనిచేసే పాఠశాలకు వెళ్లాలని ఆదేశించారు. ఆమె అక్కడికి వెళ్లకుండా ప్రజాప్రతినిధుల ద్వారా విద్యాశాఖ అధికారులపై ఒత్తిళ్లు తీసుకొచ్చి జిల్లా కేంద్రంలోని మహాలక్ష్మివాడ పాఠశాలకు మళ్లీ డిప్యూటేషన్ చేయించుకోవడం గమనార్హం. ఈ విషయమై డీఈవో ప్రణీతను వివరణ కోరేందుకు ఫోన్‌లో పలుమార్లు యత్నించగా ఆమె అందుబాటులోకి రాలేదు.

ఆగని ఆత్మహత్యలు

- ట్రిపుల్‌ఐటీలో మరో విద్యార్థి బలవన్మరణం
- క్లాసులకు హాజరైన రెండోరోజే ఘటన
- మృతుడిది సంగారెడ్డి జిల్లా కేంద్రం
- ఎనిమిది నెలల్లో నాలుగో ఘటన
- నిర్మల్ జిల్లా ఆస్పత్రికి మృతదేహం
- వివిధ పార్టీలు, సంఘాల ఆందోళన





జాదవ్ బబ్లూ (ఫైల్)

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీలో విద్యార్థుల ఆత్మహత్యలు ఆగడంలేదు. మంగళవారం మరో విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. కళాశాలలో ఇటీవలే చేరిన సంగారెడ్డి జిల్లా నారాయణ్‌ఖేడ్ మండలం నాగాపూర్ గ్రామానికి చెందిన జాదవ్ బబ్లూ (16) మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఇటీవలే పీయూసీ–1లో ప్రవేశం పొందిన బబ్లూ ఈనెల 31న క్యాంపస్ అధికారులు నిర్వహించిన ఓరియంటేషన్‌కు హాజరయ్యాడు. సోమవారం నుంచి తరగతులు ప్రారంభించగా మంగళవారం హాస్టల్‌గదిలో ఉరేసుకున్నాడు. విషయం తెలుసుకున్న క్యాంపస్ అధికారులు ఆస్పత్రికి తరలించేలోపే అపస్మారకస్థితికి చేరుకుని మృతి చెందాడు. విద్యార్థి మృతదేహాన్ని నిర్మల్ ఏరియాస్పత్రికి తరలించారు. కాగా, బబ్లూ మృతికిగల కారణాలు తెలియరాలేదు. విద్యార్థి ఆత్మహత్య విషయం తెలియగానే వివిధ విద్యార్థి సంఘాలు, పార్టీలు ఆందోళనకు దిగాయి. కాగా, అధి కారులు క్యాంపస్‌లోకి ఎవరినీ అనుమతించలేదు.

మధ్యాహ్నమే తల్లికి ఫోన్ చేసి..

నాగాపూర్‌కు చెందిన జాద వ్ సంతోష్–రుక్మిణి దంపతులు సొంతూరు వదిలి సంగారెడ్డికి వచ్చి కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి నలుగురు సంతానం కాగా జాదవ్ బబ్లూ పెద్దవాడు. పేద కుటుంబంలో పుట్టిన బబ్లూ ఆందోల్ మండలం నేరేడిగుంటలో పదో తరగతి చదివి 9.5 జీపీఏతో ఉత్తీర్ణుడయ్యాడు. ట్రిపుల్‌ఐటీలో సీటు సాధించగా తల్లిదండ్రులు ఆనందపడ్డారు. ఇటీవలే ఆర్జీయూకేటీలో చేరాడు. మంగళవారం మధ్యాహ్నం తల్లి రుక్మిణికి ఫోన్ చేసి పలకరించాడు. సాయంత్రమే ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలిసి కుటుంబ సభ్యులంతా శోకసంద్రంలో మునిగిపోయారు.

ఎనిమిది నెలల్లో నాలుగో ఘటన

ట్రిపుల్‌ఐటీలో ఎనిమిది నెలల వ్యవధిలో నలుగురు విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. గతేడాది డిసెంబర్‌లో ఒకరు, జూన్‌లోఒక్కరోజు వ్యవధిలో ఇద్దరు, మంగళవారం బబ్లూ ఆత్మహత్య చేసుకున్నారు. జూన్ 13న సంగారెడ్డికి చెందిన వడ్ల దీపిక ఆత్మహత్య చేసుకోగా ఈ ఘటనపై ఎన్నో అనుమానాలున్నాయి. అదేరోజు నలుగురు సభ్యులతో నిజనిర్ధారణ కమిటీ వేసినా ఇప్పటికీ ఆత్మహత్యకుగల కారణాలు బయట పెట్టకపోవడం అనుమానాలకు తావిస్తోంది. జూన్ 14న అర్ధరాత్రి తర్వాత గంగా బ్లాక్ నాలుగో అంతస్తు పైనుంచి విద్యార్థిని లిఖిత దూకి చనిపోగా ఈ ఘటనపై అనుమానాలు లేవని కుటుంబ సభ్యులు, వర్సిటీ వర్గాలు చెబుతున్నా.. ఏదో మిస్టరీ ఉందన్న వాదనలూ బలంగా ఉన్నాయి. రాత్రి 2.30 గంటల సమయంలో లిఖిత బయటకు ఎందుకు వచ్చిందనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నా యి. ఆమె మరణంపై సెక్యూరిటీగార్డులు, అధికారులు చెప్పిన వివరణలు వేర్వేరుగా ఉండడం గమనార్హం.

విద్యార్థి మృతి బాధాకరం

బాసర ట్రిపుల్‌ఐటీలో పీయూసీ ఫస్టియర్ విద్యార్థి జాదవ్ బబ్లూ ఆత్మహత్యకు పాల్పడడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. వ్యక్తిగత కారణాలతోనే అతడు ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని భావిస్తున్నాం. విద్యార్థులు మనోధైర్యాన్ని కోల్పోవద్దు. ఏవైన సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలి.
– ప్రొఫెసర్ వెంకటరమణ, ఆర్జీయూకేటీ వీసీ

నిర్మల్‌లో ఉద్రిక్తత



టీజేఏసీ విద్యార్థి విభాగం అధ్యక్షుడిని బలవంతంగా తరలిస్తున్న పోలీసులు

నిర్మల్: బాసర ట్రిపుల్‌ఐటీ విద్యార్థి జాదవ్ బబ్లూ ఆత్మహత్యపై మంగళవారం రాత్రి ప్రతిపక్షాలు చేపట్టిన ఆందోళనలు, పోలీసుల బలవంతపు అరెస్టులతో జిల్లాకేంద్రంలో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ముందుగా జిల్లా ఆస్పత్రిలో ఆందోళన చేసిన కాంగ్రెస్ నేతలను పోలీసులు అరెస్ట్ చేసి సోన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మళ్లీ కొందరు నాయకులు రాత్రి కలెక్టర్ క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడించేందుకు యత్నించారు. దీంతో పోలీసులు వారిని బలవంతంగా అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. కలెక్టర్‌ను కలిసేవరకు నిరసన ఆపమంటూ శ్రీహరిరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేతలు భీష్మించడంతో చివరకు పోలీసు బందోబస్తు నడుమ కలెక్టరేట్‌కు తీసుకెళ్లారు. అక్కడ వారు కలెక్టర్ వరుణ్‌రెడ్డికి వినతిపత్రం అందించారు.

సిట్టింగ్‌జడ్జితో విచారణ జరిపించాలి

బాసర ట్రిపుల్‌ఐటీలో విద్యార్థుల ఆత్మహత్యలపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని కలెక్టర్‌కు ఇచ్చిన వినతిపత్రంలో కాంగ్రెస్ నేత శ్రీహరిరావు డిమాండ్ చేశారు. దివంగత సీఎం వైఎస్సార్ పేద పిల్లల కోసం ఏర్పాటు చేసిన ట్రిపుల్‌ఐటీని సీఎం కేసీఆర్ కావాలని నాశనం చేస్తున్నారని ఆరోపించారు. ఇతర రాష్ట్రాల్లో పార్టీ విస్తరణపై ఉన్న శ్రద్ధ రాష్ట్రంలో విద్యార్థులపై లేదన్నారు. వెంటనే ట్రిపుల్‌ఐటీకి రెగ్యులర్ వీసీని నియమించాలని డిమాండ్ చేశారు.

అరెస్ట్.. నిర్బంధం..

ట్రిపుల్‌ఐటీ విద్యార్థి మరణవార్త తెలుసుకుని జిల్లా ఆస్పత్రికి వచ్చిన టీజేఏసీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ వినోద్ ఇతర నాయకులను పోలీసులు బలవంతంగా అరెస్ట్ చేశారు. మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి నివాసం ఎదుట ముందస్తుగా పోలీసు బలగాలను మోహరించారు.

క్లుప్తంగా

ఆదివాసీ దినోత్సవం ఘనంగా నిర్వహిస్తాం



పనులు పరిశీలిస్తున్న ఆదివాసీ పెద్దలు

ఇంద్రవెల్లి(ఖానాపూర్): ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామని ఆదివాసీ సంఘాల నాయకులు అన్నారు. మంగళవారం మండలంలోని కేస్లాపూర్ నాగోబా దర్బార్ హాల్‌లో వేడుకల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా నుంచి 9 తెగల ఆదివాసీ సంఘాల నాయకులు, ఆదివాసీ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, రాయిసెంటర్ సార్‌మెడిలు, గ్రామాల పటేళ్లు, పెద్దలు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిడాం భీంరావ్, ఆర్క ఖమ్ము, మెస్రం వెంకట్‌రావ్, మెస్రం నాగ్‌నాథ్, తొడసం సాగర్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మీ జవాన్ పార్థివదేహంతో ర్యాలీ



ర్యాలీగా తీసుకొస్తున్న యువకులు

నేరడిగొండ(బోథ్): మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ సోలంకి సుధాకర్ సింగ్ విధి నిర్వహణలో భాగంగా ఆదివారం కశ్మీర్‌లో గుండెపోటుతో హఠాన్మరణం పొందారు. పార్థివ దేహాన్ని మంగళవారం సొంత గ్రామమైన కిష్టాపూర్‌కు తీసుకువచ్చారు. మండలంలోని బంధంరేగడి బైపాస్ నుండి స్థానిక యువత, నాయకులు బైక్ ర్యాలీ మధ్య నేరడిగొండకు తీసుకువచ్చారు. జెడ్పీటీసీ అనిల్ జాదవ్, తెలంగాణ అధ్యాపక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్, కాంగ్రెస్ నాయకులు ఆడే గజేందర్ పాల్గొన్నారు. సుధాకర్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బుధవారం కిష్టాపూర్‌లో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

మోటార్ వైర్ల చోరీ

బోథ్: మండలంలోని సొనాలలో కొన్ని రోజులుగా పంట చేలల్లోని విద్యుత్ మోటార్లకు సంబంధించిన వైర్లు చోరీకి గురవుతున్నాయి. సోమవారం రాత్రి గ్రామానికి చెందిన గాజుల శంకర్ చేనులో వైరుతో పాటు ఇతర సామగ్రిని దొంగిలించారని రైతు వాపోయాడు. పోలీసులు గస్తీ పెంచాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

సారంగపూర్(నిర్మల్): మండలంలోని లింగాపూర్, దుర్గానగర్ తండాల్లోని గుడుంబా స్థావరాలపై మంగళవారం ఎక్సైజ్ ఎస్సై రవికుమార్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. విక్రయానికి సిద్ధంగా ఉంచిన 25 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. గుడుంబా తయారు చేస్తున్న రాథోడ్ రేణుకాబాయి, ఆడె లాలు, ఆడ భుక్యా, జాదవ్ నిర్మలాబాయి, ఆడె మధుకర్‌పై కేసు నమోదు చేసి తహసీల్దార్ శ్రీదేవి ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

అడవితల్లి బిడ్డలు..

కైలాస్‌నగర్/బజార్‌హత్నూర్: ఆదివాసీల జీవన వి ధానం ముఖ్యంగా పోడుభూములను సాగుచేస్తూ జీవనం కొనసాగించడం.. అడవుల్లో లభించే వనమూలికలు సేకరించి విక్రయిస్తూ అటవీ ఉత్పత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. అయితే సంప్రదాయబద్ధమైన ఆచార వ్యవహారాలు, భిన్నంగా ఉండే సంస్కృతి ఆదివాసీల సొంతం. వాళ్లంతా సమాజానికి దూరంగా కొండ కోనల మధ్య జీవనం సాగిస్తారు. అడవే వారి ఆవాసం. ఇదీ ఆదివాసీల జీవన చిత్రం. ఆదివాసీలకు హక్కులు కల్పించేందుకు 1994 ఆగస్టు 9న ఐక్యరాజ్యసమితి ప్రపంచ ఆదివాసీ దినోత్సవంగా గుర్తించింది. నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

- ఆదివాసీల జీవనం.. సాంస్కృతిక వైవిధ్యం
- ప్రకృతిని ఒడిలో భిన్నమైన జీవన విధానం..
- సంస్కృతి, సంప్రదాయాలు, ప్రకృతిని పూజించడం వారి ప్రత్యేకత
- నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం



గుస్సాడీ నృత్యం చేస్తున్న ఆదివాసీలు (ఫైల్)

సంస్కృతి, సంప్రదాయాలు

ఆదివాసీ కళలు, సంస్కృతితోనే వారి జీవనం ముడిపడి ఉంది. జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన గుస్సాడి దండారి వేడుక గిరిజనుల జీవనశైలిని ప్రతిబింబించే ప్రధాన పండగ. నెమలి ఈకలతో ప్రత్యేకంగా తయారు చేసిన టోపీలు, జంతు చర్మంతో తయారు చేసిన డప్పులు, డోలు, గుమేల, ఫరా లాంటి వాయిద్యాలతో పాటు గజ్జెలు, కోలాలు, మంత్ర దండం లాంటి రోకలి, తదితర సంప్రదాయ వస్తువులను గ్రామ పటేల్ ఇంటి ముందు ఉంచి వాటికి బలిదానం, ప్రత్యేక పూజలు, భోగి పండగ చేసి దండారి ఉత్సవాలు ప్రారంభిస్తారు. నెల రోజుల పాటు వేడుకలను అత్యంత వైభవంగా జరుపుకుంటారు. గుస్సాడి నృత్యానికి ఆద్యుడైన కనకరాజును కేంద్రం పద్మశ్రీతో సత్కరించి అవార్డును అందించడం ఈ కళకు ఉన్న ప్రత్యేకతను చాటుతోంది.

న్యాయ సలహా కేంద్రంగా రాయి సెంటర్లు

20 నుంచి 40 గిరిజన గ్రామాల పరిధిలో ఒక రాయి సెంటర్ ఉంటుంది. దీనికి గోండులు, కొలాం, పర్ధాన్, తోటి, నాయక్‌పోడ్, అంద్ గిరిజన తెగలు ప్రాతినిథ్యం వహిస్తాయి. ఆయా గ్రామాల్లోని పటేల్, దేవరి, మహాజన్, గట్యాల్ (గిరిజన జాతుల పెద్దలు) కలిసి 11 మంది కార్యవర్గంతో రాయిసెంటర్ ఏర్పడుతుంది. రాయిసెంటర్ పెద్దను సార్‌మేడి (అధ్యక్షుడు), ఉపమేడి(ఉపాధ్యక్షుడు), గీతాదార్(కార్యదర్శి), ఖజానాదార్(కోశాధికారి), అవాల్‌దార్(సమాచారం), మిగిలినవారు సలహాదారులుగా వ్యవహరిస్తారు. ఉమ్మడి జిల్లాలో 120 రాయి సెంటర్లు ఉన్నాయి. వీటన్నింటిపై జిల్లాస్థాయిలో ఉట్నూర్‌లోని గుస్సాడిగుట్టలో జిల్లా రాయిసెంటర్ ఉంది. అక్కడి పెద్దను జిల్లా మేడి అని సంబోధిస్తారు. నెలకోసారి సమావేశాలు నిర్వహిస్తారు. గ్రామంలో కుటుంబ గొడవలు, ఆస్తి తగాదాలు, భార్యభర్తల గొడవలు, గిరిజనులకు సంబంధించిన అనేక సమస్యలను గ్రామ పటేల్ పరిష్కరిస్తారు. పరిష్కారం కానిపక్షంలో ఆ కేసును డివిజన్ రాయ్‌సెంటర్‌కు బదిలీ చేస్తారు. అక్కడా పరిష్కారం కాకుంటే జిల్లా స్థాయిలో ఉట్నూర్ గుస్సాడిగుట్ట రాయిసెంటర్‌కు బదిలీ చేస్తారు. ఆదివాసీల సమస్యల పరిష్కారంలో ఈ రాయిసెంటర్ల పాత్ర ఎంతో ప్రత్యేక మైంది.

ప్రత్యేక వేషధారణ

దండారి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిది రోజుల పాటు గుస్సాడి వేషధారణ వేసిన వారు దండారి ముగిసేవరకూ స్నానం చేయరు. ఒంటికి బూడిద పూసుకుని స్నానంగా భావించడం వీరి ఆచారం. దీంతో పాటు ముఖానికి మసి, ఎడమ భుజంపై జింకతోలు, మెడలో రుద్రాక్షలు, కుడిచేతిలో మంత్రదండం(రోకలి), జంతువుల కొమ్ములు, నెమలి ఈకలతో చేసిన టోపీలు, కాళ్లకు గజ్జెలు, నడుముకు వస్తువుల సంచి వంటి విచిత్ర వేషధారణతో సంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తారు.

సంప్రదాయాలు బలోపేతం

1943 నిజాం కాలం నుంచే రాయిసెంటర్లను వెలుగులోకి తెచ్చిన ఘనత మొదటి గిరిజన ఐఏఎస్ మడావి తుకారంకు దక్కుతుంది. ఉట్నూర్ మండలం లక్కెట్టిపేటకు చెందిన తుకారాం గిరిజన వ్యవహారాల్లో కీలకమైన షోడావాజన్(16 రకాల వాయిద్యాలు), అట్రడెమ్సంగ్(18 రకాల నృత్యాలు)లను పటిష్టం చేయడానికి విశేష కృషి చేశారు. రాయి సెంటర్లకు చట్టబద్ధత కల్పించారు.

ఉమ్మడి జిల్లాల వారీగా ఆదివాసీ జనాభా వివరాలు

జిల్లా	మండలాలు	షెడ్యుల్డ్ ఏరియా	నాన్ షెడ్యూల్డ్ ఏరియా
ఆదిలాబాద్	18	1,52,308	1,17,014
కుమురంభీం	15	83,459	50,347
మంచిర్యాల	18	11,496	45,294
నిర్మల్	19	-	80,576

ఆదివాసీల ప్రస్తుత స్థితిగతులు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 9 ఆదివాసీ గిరిజన తెగలు ఉన్నాయి. గోండు, కొలాం, ప్రధాన్, కోయ, తోటి, మన్నెవార్, అంద్, నాయక్‌పోడ్, తదితర ఆదివాసీ తెగలు ఏజెన్సీ ప్రాంతాల్లో జీవనం సాగిస్తున్నాయి. ప్రపంచం రోజురోజుకూ ముందుకు దూసుకెళ్తున్నా ఆదివాసీల జీవనం మాత్రం ఇంకా వెనుకబడే ఉంది. స్వాతంత్రం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా వారి జీవన స్థితిగతులు నేటికీ అలాగే ఉన్నాయి. కొమురం భీం, బిర్సాముండా, రాంజీగోండు పోరాటాల స్ఫూర్తితో ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) ఏర్పాటు చేసుకుని నిరంతరం ఉద్యమాలు చేస్తునే ఉన్నారు.

ఆధ్యాత్మికతలోనూ వైవిధ్యమే

ఆదివాసీల జాతరలు, పండగల నిర్వహణలో వైవిధ్యం కన్పిస్తోంది. ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన జాతరల్లో కేస్లాపూర్ నాగోబా జాతర ఒకటి. ఏటా పుష్యమాస అమావాస్య రోజున ప్రారంభమయ్యే ఈ జాతరలో మెస్రం వంశీయులు తమ ఆరాధ్యదైవమైన నాగోబాను భక్తి భావంతో కొలుస్తూ పూజలు నిర్వహిస్తారు. రాష్ట్రంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి సైతం లక్షలాదిగా ఆదివాసీలు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేస్తారు. జై జంగో.. జైలింగో అనే భక్తిభావాన్ని చాటుతూ జంగుబాయి దీక్షలను సైతం ఎంతో నిష్ఠగా ఆచరిస్తారు.



అకాడి దేవతకు పూజలు చేస్తున్న ఆదివాసీ గిరిజనులు (ఫైల్)


సంస్కృతి, సంప్రదాయాలకు ప్రత్యేకత



ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రత్యేకత ఉంది. నేడు సాంకేతికంగా దేశం ఎంతగానో అభివృద్ధి చెందుతున్నా ఆదివాసీ గిరిజనులు మాత్రం తమ పూర్వీకులు అందించిన సంస్కృతి, సంప్రదాయాలను ఇప్పటికీ కాపాడుతున్నారు. దండారి పండుగను ఎంతో నియమ నిష్టలతో చేయడం గర్వకారణం.

– గొడం నగేష్, గిరిజన శాఖ మాజీమంత్రి

ఉత్సవాలు ఘనంగా జరుపుకోవాలి



ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దంపట్టేలా నేడు ఆదివాసీ దినోత్సవాన్ని అన్ని గూడేల్లో ఘనంగా జరుపుకోవాలి. విద్య, వైద్యం, సామాజికంగా ఆదివాసీలు అభివృద్ధి చెందే కార్యక్రమాలను ఐటీడీఏ ద్వారా చేపట్టాలి. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి.

– కనక రాజు, పద్మశ్రీ అవార్డు గ్రహీత, మార్లవాయి, జైనూర్

ఆదివాసీల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి



ఆదివాసీ గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఇప్పటికీ చాలా గ్రామాలకు రోడ్డు, రవాణా సౌకర్యాలు లేవు. వాగులు దాటి రాలేని గ్రామాలు ఎన్నో అన్నాయి. గిరిజన గ్రామాలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందినప్పుడే ఆదివాసీలకు సరైన గుర్తింపు.

– మెస్రం దుర్గు, రాయిసెంటర్ జిల్లా సార్‌మేడి, నార్నూర్

బౌద్ధ మహాసభలో జిల్లాకు చోటు అభినందనీయం



ప్రజ్ఞాకుమార్‌ను సత్కరిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: భారతీయ బౌద్ధ మహాసభలో జిల్లాకు చోటు కల్పించడం అభినందనీయమని మార్వాడి సమాజ్ నేత ధర్మాదాస్ శర్మ అన్నారు. ఇటీవల బౌద్ధ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన ఆదిలాబాద్ పట్టణానికి చెందిన రత్నజాడే ప్రజ్ఞాకుమార్‌ను మార్వాడి సమాజ్ ఆధ్వర్యంలో మంగళవారం శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎన్నో ఏళ్లుగా బౌద్ధ సమాజం, అంబేద్కర్ సమాజానికి సేవలందిస్తున్న రత్న జాడే ప్రజ్ఞా కుమార్‌ను రాష్ట్రస్థాయి బౌద్ధ మహాసభలో చోటు కల్పించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆయుష్ ఆగర్వాల్, సతీష్ శర్మ, మనోజ్ ఖత్రి, షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సంస్థ జిల్లా యూత్ అధ్యక్షుడు రాజు మస్కే, ఆదిలాబాద్ టౌన్ అధ్యక్షుడు ప్రమోద్ మూడే, ఉపాధ్యక్షులు రాజు పటాడే, భుక్తాపూర్ బుద్ధ విహార్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఉదయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమానికి వ్యతిరేకంగా పాలన

- ఎన్‌ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముడుపు నళినీరెడ్డి



మాట్లాడుతున్న నళినీరెడ్డి

ఎదులాపురం: సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాల్సిన ప్రభుత్వాలు అందుకు భిన్నంగా పాలన చేస్తున్నాయని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) రాష్ట్ర సహాయ కార్యదర్శి ముడుపు నళినీరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం సమాఖ్య జిల్లా విస్తృత కౌన్సెలింగ్ సమావేశంలో ఆమె మాట్లాడారు. దేశంలో ప్రజా వ్యతిరేక పాలన సాగుతోందని, మహిళా సంక్షేమం మచ్చుకైనా కానరావడం లేదన్నారు. మహిళా చట్టాలు, సంక్షేమ పథకాలు కేవలం పేరుకే పనిచేస్తున్నాయన్నారు. మణిపూర్‌లో మహిళల వివస్త్ర ప్రదర్శన, అత్యాచారం, హత్యలే నిందుకు ప్రత్యేక నిదర్శనమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో స్పందించకపోవడం విస్మయ పరుస్తోందన్నారు. కేంద్రం వెంటనే స్పందించి మణిపూర్ సీఎంను పదవి నుంచి తొలగించాలన్నారు. మద్యం మత్తులో హత్యలు, అత్యాచారాలు జరుగుతుంటే నిషేధించకుండా మూడు నెలలకు ముందే సీఎం కేసీఆర్ మద్యం టెండర్లను ఆహ్వానించడం మరింత శోచనీయమన్నారు. ప్రభుత్వాలకు ప్రజల మాన, ప్రాణాలు అక్కర్లేదని, అధికార వ్యామోహం, ధనార్జనే ధ్యేయంగా బీజేపీ, టీఆర్‌ఎస్‌లు పని చేస్తున్నాయని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు తీరు మార్చుకుని ప్రజా సంక్షేమం దిశగా పని చేయాలని, మహిళా చట్టాలను పటిష్టం చేసి వారి మాన, ప్రాణాలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. నిత్యావసర సరుకులు, వంట గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలన్నారు. సమావేశంలో సమాఖ్య జిల్లా నాయకురాలు గోదావరి, అమీనా ఖాన్, ఛాయా, కృష్ణవేణి, తార రుక్మిణి, వనిత, తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురు ఆత్మహత్య

వేర్వేరు కారణాలతో జిల్లాలో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు.

పురుగుల మందు తాగి ఒకరు..



శ్రీనివాస్ (ఫైల్)

లోకేశ్వరం(ముధోల్): పురుగుల మందుతాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కిష్టాపూర్‌కు చెందిన మినుగురుల శ్రీనివాస్ (40) కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయి తిరుగుతున్నాడు. సోమవారం తన ఇంట్లో గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు నిర్మల్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతునికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

కాటన్‌యార్డులో ఉరేసుకొని ఒకరు

భైంసాటౌన్(ముధోల్): భైంసాలోని ఏఎంసీకి చెందిన కాటన్ మార్కెట్ యార్డులో ఒకరు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఎస్సై ఎండీ గౌసుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని జుల్ఫికర్ గల్లీకి చెందిన సాప్పర్‌వార్ మల్లేశ్ (65) చిరువ్యాపారాలు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. సోమవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. మంగళవారం ఉదయం కాటన్‌యార్డులోని రైతు విశ్రాంతి భవనం వద్ద రేకులషెడ్డు పైకప్పుకు ఉరేసుకుని కనిపించడంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుని కుమారుడు విఠల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

కీళ్లనొప్పులు భరించలేక మరొకరు..



గంగారాం (ఫైల్)

తానూరు(ముధోల్): కీళ్ల నొప్పులు భరించలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని హిప్నెల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై సందీప్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన సోన్‌కాంబ్లె గంగారాం (58)కొంతకాలంగా కీళ్ల నొప్పులు, ఫైల్స్‌తో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా వ్యాధి నయంకాలేదు. దీంతో మనస్తాపానికి గురయ్యాడు. మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుని భార్య తుల్సాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మృతుడు జగిత్యాల జిల్లా వాసి

కడెం: ఈ నెల7న మండలంలోని గోదావరి సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన విషయం తెలిసిందే. మంగళవారం విచారణ చేపట్టిన పోలీసులు జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని వీరాపూర్‌కు చెందిన శనిగారపు దేవయ్య (72)గా గుర్తించారు. ఈనెల 6న ఇంటినుంచి బయటకు వెళ్లిన దేవయ్య తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు తెలిసిన చోట గాలించారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో రాయికల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కడెం మండలం చిన్నబెల్లాల్ సమీపంలోని గోదావరిలో స్థానికులకు మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. మృతుని భార్య రాజవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై భీంరావు తెలిపారు.

నేటి ధర్నాకు సహకరించాలి

ఎదులాపురం: కలెక్టరేట్ ఎదుట బుధవారం నిర్వహిస్తున్న మహాపడావ్ ధర్నాకు సహకరించాలని కోరుతూ ఏఐటీయూసీ నాయకులు మంగళవారం రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీడీ మిల్కా, మున్సిపల్ శానిటరీ ఇన్స్‌పెక్టర్ నరేందర్, రిమ్స్ హెడ్ కాంట్రాక్టర్ హెచ్‌ఎస్ రవికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ కంపెనీకి రూ.10 లక్షలు జరిమానా

గుడిహత్నూర్(బోథ్): మండల కేంద్రానికి చెందిన శహనే మాధవ్ కొల్హారీ శివారులోని తన చేనులో 2020 మే నెలలో అగ్రి విట్రో టెక్ లేబరేటరీస్, హైదరాబాద్ కంపెనీ వారి వద్ద 4,322 అరటి మొక్కలను కొనుగోలు చేసి తన రెండున్నర ఎకరాల్లో నాటాడు. సగానికి పైగా మొక్కలు ఎదుగుదల లేక కాత కాయలేదు. దీంతో తెలంగాణ వినియోగదారుల సంఘాల సమైఖ్య క్యాట్కో అనుబంధ సంఘం ఏసీఎఫ్ వినియోగదారుల సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎల్చల్‌వార్ సత్యనారాయణను కలిసి తన గోడు వెల్లబోసుకున్నాడు. పంటను పరీక్షించి నివేదిక ఇవ్వాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారులను కోరాడు. సీనియర్ శాస్త్రవేత్త వి.సుచిత్ర పంట క్షేత్రాన్ని పరిశీలించి నాసిరకం మొక్కలు ఇవ్వడం వల్లే పంట వైరల్ ఇన్‌ఫెక్షన్‌కు గురైందని నివేదిక ఇచ్చారు. దీనిని ఆధారంగా చేసుకుని ఉమ్మడి జిల్లా కన్స్యూమర్ కోర్టులో బాధితునికి రూ.15లక్షల నష్ట పరిహారం కోరుతూ న్యాయవాది కె.విశ్వనాథ్ జూలై 17, 2021లో కేసు దాఖలు చేశారు. కన్స్యూమర్ కోర్టు విచారణ జరిపి సదరు కంపెనీ రూ.10లక్షలు నష్టపరిహారం చెల్లించాలని బాధిత రైతు శాహనే మాధవ్‌కు అనుకూలముగా గత నెల 25న తీర్పునివ్వగా ఈ నెల 08న అధికారికంగా ప్రకటించింది. తీర్పుపై ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వినియోగదారుల సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి.





వైభవంగా శ్రీమద్భాగవత సప్తాహ

ఆదిలాబాద్: అధిక శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని ఈ నెల 4 నుంచి జిల్లా కేంద్రంలోని శ్రీరామచంద్ర గోపాలకృష్ణమఠంలో శ్రీమద్భాగవత సప్తాహ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా వేద పండితులు మేఘరాజశర్మ భాగవతం గురించి భక్తులకు వివరించారు. అనంతరం భక్తులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

'గృహలక్ష్మి'కి దరఖాస్తుల వెల్లువ


ఇంద్రవెల్లి: దరఖాస్తు స్వీకరిస్తున్న అధికారులు

ఇంద్రవెల్లి: ఇళ్లు లేకుండా ఇంటి స్థలం ఉన్నవారి కి రూ. 3 లక్షల ఆర్థికసాయం అందించేందుకు ప్రభుత్వం గృహలక్ష్మి పథకం ప్రవేశపెటింది. ఇందులో భాగంగా తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. డిప్యూటీ తహసీల్దార్ రమేశ్ మాట్లాడుతూ 'గృహలక్ష్మి' కోసం ఈనెల 10 వరకు దరఖాస్తులు అందించాలని సూచించారు. ఈ దరఖాస్తులను ఈనెల 20 వరకు పరిశీలించి అర్హుల జాబితాను విడుదల చేస్తామని తెలిపారు.

నార్నూర్: తహసీల్దార్ కార్యాలయంలో గృహలక్ష్మి దరఖాస్తులు స్వీకరించడానికి ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ రాజలింగం తెలిపారు. మంగళవారం లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. డీటీ అమృత్‌లాల్, ఆర్‌ఐ కవిత తదితరులు ఉన్నారు.

బోథ్: తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

తాంసి: తహసీల్దార్ కార్యాలయంలో లబ్ధిదారుల నుంచి తహసీల్దార్ లక్ష్మి దరఖాస్తులు స్వీకరించారు. మంగళవారం తొలి రోజు 21 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. డిప్యూటీ తహసీల్దార్ విష్ణు జాదవ్, సీనియర్ అసిస్టెంట్ నరేశ్, జూనియర్ అసిస్టెంట్ బాపురావు, వీఆర్‌ఏ జీవన్ ఉన్నారు.

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట లబ్ధిదారులు బారులు తీరారు. దరఖాస్తులను డిప్యూటీ తహసిల్దార్ భుజంగ్‌రావు స్వీకరించారు. మొత్తం 150 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు.


తాంసిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్



బోథ్: తహసీల్దార్ కార్యాలయంలో..

దరఖాస్తుదారుల బారులు



నేరడిగొండ: గృహలక్ష్మి పథకం కోసం మంగళవారం లబ్ధిదారుల నుంచి అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. గ్రామాల నుంచి మండల కేంద్రానికి చేరుకున్న దరఖాస్తుదారులు బారులు తీరారు. మీసేవ కేంద్రం, జిరాక్స్ సెంటర్ల వద్ద జనాలు గుమిగూడి కనిపించారు.

దరఖాస్తుల గడువు పెంచాలి

ఎదులాపురం:'గృహలక్ష్మి' దరఖాస్తుల గడువు పెంచి, ఇళ్లు లేని నిరుపేదలకు షరతుల్లేకుండా అందించాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి జగన్‌సింగ్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ×గృహలక్ష్మి÷పథకానికి ప్రభుత్వం మూడు రోజుల సమయం ఉండడంతో దరఖాస్తుదారులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. అన్ని ధ్రువపత్రాలు సిద్ధం చేసుకోవడానికే నాలుగురోజుల సమయం పడుతుందన్నారు. దరఖాస్తు గడువు పొడిగించాలని కోరారు. సమావేశంలో నాయకులు అశోక్, వినోద్, ఉత్తం తదితరులు పాల్గొన్నారు.

'అర్హులకు న్యాయం చేయాలి'

'గృహలక్ష్మి'కోసం లబ్ధిదారుల నుంచి దరఖాస్తుల స్వీకరణకు కేవలం మూడురోజుల గడువు ఇవ్వడాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్ ఖండించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ధ్రువపత్రాలు పొందడానికే గడువు సమయం సరిపోదన్నారు. చాలామందికి దరఖాస్తు విషయం తెలియదన్నారు. గృహలక్ష్మి దరఖాస్తు గడువు పెంచి అర్హులకు న్యాయం చేయాలన్నారు.

ఎదులాపురం/బోథ్: రాష్ట్ర ప్రభుత్వం మద్యం షాపులకు 10 రోజుల సమయం ఇచ్చి గృహలక్ష్మి పథకానికి మూడు రోజుల గడువు ఇవ్వడం సరికాదని కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి పేర్కొన్నారు. దరఖాస్తు గడువు 15 రోజులకు పెంచాలని డిమాండ్ చేశారు.

ఆదిలాబాద్‌రూరల్: గృహలక్ష్మి పథకం దరఖాస్తుల స్వీకరణ గడువును పెంచాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్యాల మనోజ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 8 నుంచి ప్రారంభించిన గృహలక్ష్మి దరఖాస్తుల స్వీకరణకు ప్రభుత్వం కేవలం మూడు రోజులు మాత్రమే అవకాశం ఇవ్వడం సరికాదన్నారు. కుల,ఆదాయ ధ్రువీకరణ పత్రాలు రెవెన్యూ అధికారులు రెండు రోజుల్లో ఇచ్చే అవకాశం లేదన్నారు. దరఖాస్తుల స్వీకరణ గడువును ప్రభుత్వం మరో పదిరోజులు పెంచాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కోశాధికారి లింగంపల్లి ప్రసన్న కుమార్, ఉపాధ్యక్షుడు కొల్లూరి స్వామి, నాయకులు దుర్గయ్య, రాములు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జహీరుద్దీన్‌ఖాన్‌కు నివాళి


నివాళులర్పిస్తున్న జర్నలిస్టులు

ఆదిలాబాద్: హైదరాబాద్‌లో గద్దర్ అంతిమ యాత్రలో గుండెపోటుతో సియాసత్ మేనేజింగ్ ఎడిటర్ ఎండీ జహీరుద్దీన్‌ఖాన్ మృతిచెందడం బాధాకరమని సీనియర్ జర్నలిస్టు మహబూబ్‌ఖాన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో మంగళవారం ఆయన చిత్రపటానికి జిల్లా జర్నలిస్టులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మృతి ఉర్దూ పత్రిక రంగానికి తీరని లోటన్నారు. టీడబ్ల్యూజేఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సురేష్, షేక్ మోయిస్, జర్నలిస్టులు వినోద్, రాజేష్, సుధాకర్, సారంగపాణి, సురేష్, నిలేష్, అరుణ్‌రెడ్డి, ఖిజర్ యాఫై, శ్రీనివాస్, రాము, గుణవంత్ ఉన్నారు.

యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శిగా అనీష్


నియామక పత్రం అందుకుంటున్న అనీష్

బోథ్: యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శిగా సోనాల గ్రామానికి చెందిన గుడాల అనీష్ నియమితులయ్యారు. ఆదిలాబాద్‌లో జిల్లా అధ్యక్షుడు సాయిచరణ్‌గౌడ్ మంగళవారం ఆయనకు నియామకపత్రం అందజేశారు. తనపై నమ్మకంతో బాధ్యతలను అప్పగించిన జిల్లా అధ్యక్షుడితోపాటు నాయకులు ఆడే గజేందర్, పసుల చంటికి అనీష్ కృతజ్ఞతలు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలి


లైన్ ఇన్‌స్పెక్టర్ పురుషోత్తంకు వినతిపత్రం ఇస్తున్న ఖడ్కీ గ్రామస్తులు

బేల: మండలంలోని ఖడ్కీ గ్రామంలో నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి కోరారు. బేల విద్యుత్ సబ్ స్టేషన్‌లో లైన్ ఇన్‌స్పెక్టర్ పురుషోత్తంకు గ్రామస్తులతో కలిసి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రూపేష్‌రెడ్డి మాట్లాడుతూ గత కొన్నిరోజుల నుంచి పాత ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. సోమవారం రాత్రి పూర్తిగా అంధకారంలో ఉండాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఖడ్కీలో వెంటనే నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని కోరారు. కాంగ్రెస్ ఎస్టీ విభాగం మండల అధ్యక్షుడు మడావి చంద్రకాంత్, గ్రామస్తులు పాండు, గణపత్, హుసేన్ తదితరులు ఉన్నారు.

పంటలు పరిశీలించిన శాస్త్రవేత్తలు


పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

బోథ్: మండలంలోని మర్లపెల్లి గ్రామంలో పత్తి, చిక్కుడు పంటలను ఏరువాక శాస్త్రవేత్తలు మంగళవారం పరిశీలించారు. పత్తిలో రసం పీల్చే పురుగులో బంక సమస్యలను గుర్తించారు. అధిక వర్షాలకు పంటల పెరుగుదల తక్కువగా ఉందని వారు పేర్కొన్నారు. వ్యవసాయ అధికారులను సంప్రదించి మందులను వాడాలని సూచించారు. అనంతరం రైతు వేదికలో రైతులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. శాస్త్రవేత్తలు శ్రీధర్ చౌహన్, రాజశేఖర్, ఏఈవో శ్యాం సుందర్‌రెడ్డి, కోరమాండల్ మేనేజర్ రాజు, మనోజ్ కుమార్, గ్రోమోర్ సిబ్బంది ఉన్నారు.

రైతులకు పరిహారం అందించాలి

తలమడుగు: గతనెలలో కురిసిన వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు లోక ప్రవీణ్ రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని సుంకిడి గ్రామంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నష్టపోయిన పంటల్లో ప్రభుత్వం సర్వే నిర్వహించాలన్నారు. గత వేసవిలో వడగండ్ల వర్షానికి పంట నష్టపోయిన వారికి ఇప్పటికి పరిహారం అందలేదన్నారు. వెంటనే పరిహారం ఇవ్వాలని లేకపోతే బీజేపీ ఆధ్వర్యంలో జిల్లాలో రైతులతో కలిసి ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. నాయకులు రత్నాకర్ రెడ్డి, మహేందర్, నరేందర్ ఉన్నారు.

డబుల్‌రోడ్డు నిర్మాణం చేపట్టాలని వినతి


ఈఎన్‌సీ రవీందర్‌రావుకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు

తాంసి: మండలంలోని సావర్గాం నుంచి భీంపూర్ మండలంలోని కరంజి(టి) వరకు డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు కోరారు. హైదరాబాద్‌లోని ఆర్అండ్‌బీ కార్యాలయంలో ఈఎన్‌సీ రవీందర్‌రావును మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. సావర్గాం నుంచి కరంజి(టి) వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి గతంలో రూ.18 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. అదనంగా మరిన్ని నిధులు కేటాయించి డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని విన్నవించగా, ఈఎన్‌సీ సానుకూలంగా స్పందించారు. బీఆర్‌ఎస్ మండల నాయకుడు శ్రీధర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

టీబీ బాధితులకు పోషకాహారం


పోషకాహారం అందిస్తున్న డీఎంహెచ్‌వో

ఆదిలాబాద్: టీబీ బాధితులకు సరైన పోషకాహారం అందజేయాలని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ అన్నారు. ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా నిశ్చయమిత్ర కార్యక్రమంలో బాధితులకు మంగళవారం పోషకాహారం అందజేశారు. ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీధర్ కుమారుడు శౌర్యాన్ష్ జన్మదినం పురస్కరించుకొని ఐదుగురు టీబీ వ్యాధిగ్రస్తులకు మొదటి విడత పోషకాహారం అందించినట్లు చెప్పారు. నిశ్చయమిత్రలో భాగంగా దాతలు ముందుకు వచ్చి పోషకాహారం అందజేయాలన్నారు. ఇందులో జిల్లా క్షయ నివారణ అధికారి శ్రీకాంత్, సాయి ప్రియ, శ్రీనిజ, డీఎస్‌వో బ్రహ్మానందరెడ్డి, కృష్ణ, రమేశ్, రఘురాం తదితరులున్నారు.

ఘనంగా అడానేశ్వర్ మహారాజ్ జయంతి


పూజలు చేస్తున్న భక్తులు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని సుశ్రీనిలోమా అడానేశ్వర్ సేవాశ్రమంలో సద్గురు అడానేశ్వర్ మహారాజ్ 109వ జయంతి ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. మహారాజు ఉత్సవ విగ్రహానికి పూజలు చేశారు. అనంతరం సేవాశ్రమంలో అన్నదానం నిర్వహించారు. జిల్లా నుంచే కాక మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. సేవాశ్రమం అధ్యక్షుడు సంజయ్, ప్రధాన కార్యదర్శులు సచిన్, సాయి, సంజీవ్ దేశ్పాండే, లతా బాయి, శ్రీను తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

బోథ్: మండలంలోని గుర్రాలతండాకు చెందిన చందేల్ ఉదల్‌సింగ్ ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు ఆడే గజేంధర్ మంగళవారం పరామర్శించారు. సోనాల గ్రామానికి చెందిన ఊరే రాములు ఇటీవల మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని ఓదార్చి ఆర్థిక సాయం చేశారు. యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు పోతరెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేశ్ బత్తుల, సోనాల పట్టణ అధ్యక్షుడు చెట్లపెల్లి అనిల్, నాయకులు శేఖర్, మహిళా జిల్లా ప్రధాన కార్యదర్శి అరుణ, మండల అధ్యక్షురాలు అనితబాయి, భాస్కర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి రాజేష్, బుక రాజేష్ పాల్గొన్నారు.

పల్లెప్రగతి పనులు కొనసాగించాలి

- అదనపు కలెక్టర్ కుష్బూ గుప్తా


సావర్గాంలో ప్రకృతివనం పరిశీలిస్తున్న కుష్బూ గుప్తా

తాంసి: గ్రామాల్లో పల్లెప్రగతిలో భాగంగా చేపట్టిన పనులను నిరంతరం కొనసాగించాలని అదనపు కలెక్టర్ కుష్బూ గుప్తా సూచించారు. జీపీ కార్యదర్శుల క్రమబద్ధీకరణలో భాగంగా వారి పనితీరు తెలుసుకునేందుకు మండలంలోని సావర్గాం, గోట్కూరి, జామిడి, పాలోడి పంచాయతీలను మంగళవారం సందర్శించారు. ప్రకృతివనం, డంపింగ్ యార్డు, సెగ్రిగేషన్ షెడ్డు, వైకుంఠధామం, నర్సరీలను డీపీవో శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. గ్రామాల్లో మురుగుకాల్వల శుభ్రత, పారిశుధ్య నిర్వహణ పనులను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు పంచాయతీల్లో రికార్డులు పరిశీలించారు. డీఎల్‌పీవో ధర్మరాణి, ఎంపీవో సుధీర్ రెడ్డి, సర్పంచులు భారత్, కేశవ్‌రెడ్డి, శంకర్, కార్యదర్శులు సౌజన్య, స్వప్న తదితరులు ఉన్నారు.

స్పౌజ్ టీచర్లకు పది పాయింట్లు రద్దు చేయాలి


నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న నాయకులు

ఇంద్రవెల్లి: రాష్ట్ర ప్రభుత్వం స్పౌజ్ టీచర్లకు ఇచ్చే పది పాయింట్లు రద్దు చేయాలని తెలంగాణ నాన్ స్పౌజ్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బండి సుభాష్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండలకేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిత్‌కుమార్, నాయకులు విశ్వాస్, బలిరాం, రవీంద్రచారి, రియాజ్, సురేష్, రామేశ్వర్, బాపురావ్, సంతోష్, విష్ణు, జగదీష్, మాన్‌సింగ్, శ్రీనివాస్ ఉన్నారు.

ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి


కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

గుడిహత్నూర్: ఆర్టీసీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల బీఆర్‌ఎస్ కన్వీనర్ కరాడ్ బ్రహ్మానంద్, విలేజ్ బస్ ఆఫీసర్ బడుగు గంగయ్య కోరారు. స్థానిక బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్టీసీ పథకాల కరపత్రాలను విడుదల చేసి వారు మాట్లాడారు. విద్యార్థులకు ఉచిత పాస్‌తోపాటు టీ 90, టీ30 టికెట్లతో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులతోపాటు సాధారణ ప్రయాణికులు లబ్ధి పొందవచ్చన్నారు. కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శంభుగూడ సర్పంచ్ శంభు, బీఆర్‌ఎస్ యువజన నాయకుడు దోమకొండ సుధాకర్, ఆర్టీసీ కంట్రోలర్లు భాగ్యవతి, భాస్కర్, వీబీలు అశోక్, శ్రీనివాస్, వంశీ ఉన్నారు.

ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయండి


మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

బోథ్: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆదివాసీ నాయకులు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో మంగళవారం వారు మాట్లాడుతూ స్థానిక కుమురం భీం విగ్రహం వద్ద బుధవారం ఉదయం 9 గంటలకు భగత్ సింగ్ చౌక్ నుంచి బస్టాండ్‌లోని భీం విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ఆదివాసీ గ్రామాల పటేళ్లు, దేవరీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, ఉద్యోగులు, నాయకులు, యువకులు పాల్గొనాలని కోరారు. తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు రామేల్లి భోజన్న, సలహాదారు పంద్రం శంకర్, మండల కార్యదర్శి దుర్వ విశ్వేశ్వర్, ప్రచార కార్యదర్శి పంద్రం సోనేరావు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌అర్బన్: కాంగ్రెస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మాజీ మంత్రి రాంచంద్రారెడ్డి నివాసంలో బుధవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11.30 గంటలకు వేడుకలు ఉంటాయని, నాయకులు, కార్యకర్తలు రావాలని సూచించారు.

దీక్షలో కూర్చున్న దివ్యాంగులు

బోథ్: బోథ్‌ను డివిజన్ చేయాలని చేస్తున్న దీక్షలు మంగళవారానికి 23వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో దివ్యాంగులు కూర్చున్నారు. బోథ్ డివిజన్ ఏర్పాటు అవశ్యకత తెలిసేలా డివిజన్ సాధన సమితి సభ్యులు మండల కేంద్రంలో కరపత్రాలు పంపిణీ చేశారు. కాగా దీక్షలకు ఎంపీపీ తుల శ్రీనివాస్ మద్దతు తెలిపారు. షేక్ మహబూబ్, రాజేశ్వర్, శంకర్, శివ, ఫైజు తదితరులు ఉన్నారు.

ఉపాధి నిధులు దుర్వినియోగం చేస్తే చర్యలు

- డీఆర్‌డీవో కిషన్


నిరసన తెలుపుతున్న ఎంపీపీ, వైస్ ఎంపీపీ

బజార్‌హత్నూర్: గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఉపాధి పథకం నిధులు దుర్వినియోగం చేస్తే చర్యలు తీసుకుంటామని డీఆర్‌డీవో కిషన్ హెచ్చరించారు. మండల కేంద్రంలో మంగళవారం 13వ సామాజిక తనిఖీ సమావేశం నిర్వహించారు. గత రెండేళ్లలో మండలంలోని 30 పంచాయతీల పరిధిలో చేపట్టిన రూ.15 కోట్ల ఉపాధి హామీ పనులను డీఆర్పీలు గ్రామాల్లో తనిఖీ చేసి నివేదికలను చదివి వినిపించారు. బోస్రాలో వ్యక్తిగత మరుగుదొడ్లు, సోఫిట్స్ నిర్మించిన బిల్లులు ఇప్పటికి చెల్లించలేదని ఎంపీటీసీ సోన్‌టాకే గజానంద్ ఆరోపించారు. కొన్ని గ్రామాల్లో ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మల్టీపర్పస్ వర్కర్లు ఉద్యోగ విధుల్లో ఉన్నప్పటికి ఉపాధి పనులు చేసినట్లు రికార్డులు ఉండడంతో రికవరి చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏపీడీ రవీందర్, జెడ్పీటీసీ నర్సయ్య, ఎంపీపీ జయశ్రీ, ఎంపీడీవో చౌహన్ రాధ, వైస్ ఎంపీపీ శ్రీనివాస్, ఎంపీవో మహేందర్‌రెడ్డి, ఏపీవో శ్రీనివాస్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సమావేశం బహిష్కరణ

గ్రామసభలు నిర్వహించినప్పుడు ఎంపీటీసీలకు ఆహ్వానించడం లేదని, పెండింగ్ బిల్లులు చెల్లించడంలో అధికారులు నిర్లక్ష్యానికి నిరసనగా ఎంపీపీ జయశ్రీ, వైస్ ఎంపీపీ శ్రీనివాస్, ఎంపీటీసీ గజానంద్, సర్పంచులు శ్రీరాం, ప్రకాశ్‌లు సమావేశాన్ని బహిష్కరించారు. సమావేశం మధ్యలో బయటకు వెళ్లిపోయారు.

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత

ఆదిలాబాద్: సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్న బాధితుడికి టూ టౌన్ పోలీసులు మంగళవారం ఫోన్‌ను అప్పగించారు. సీఐ అశోక్ కథనం ప్రకారం.. జిల్లాకేంద్రానికి చెందిన సల్మాన్ హుస్సేన్‌ఖాన్ ఈనెల 6న రిమ్స్‌లో తన భార్యను డెలివరీ కోసం తీసుకువచ్చి మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నాడు. ఆయన ఫిర్యాదు మేరకు ఐఎంఈఐ నెంబర్‌తో సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా ఫోన్ ట్రాక్ చేసి మొబైల్ ఫోన్ అప్పగించారు. ఎస్సై రమణారెడ్డి, కానిస్టేబుల్ నరేశ్, ఆర్ ఎస్సై రమేశ్ అన్నారు.

ధనోరాలో డ్రైడే

తాంసి: ధనోరా గ్రామంలో మంగళవారం డ్రైడే నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతపై భీంపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. ఇళ్లతో పాటు పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. హెచ్‌ఈవో జ్ఞానేశ్వర్ ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలతో ఇంటింటా తిరుగుతూ నిల్వ ఉన్న నీటిని తొలగింపజేశారు. ఏఎన్‌ఎం సరస్వతి, జానాబాయ్ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

ఎఫ్‌ఎల్‌ఎన్ పకడ్బందీగా నిర్వహించాలి

బజార్‌హత్నూర్: ఎఫ్‌ఎల్‌ఎన్ పక్బందీగా నిర్వహించాలని సెక్టోరియల్ ఆఫీసర్ నర్సయ్య తెలిపారు. మండలంలోని గిర్నూర్‌లోని రాజారాజేశ్వర డిగ్రీ కళాశాలలో ఫౌండేషనల్ లిటరసి, న్యూమేరసి (ఎఫ్‌ఎల్‌ఎన్)లో భాగంగా మంగళవారం నిర్వహించిన ఆంగ్ల శిక్షణ తరగతులను పరిశీలించారు. ఎంఈవో శ్రీకాంత్, ఉపాధ్యాయులు ఉన్నారు.

క్రీడా సామగ్రి పంపిణీ

బోథ్: మండల కేందంలో యువతకు ఎంపీపీ తుల శ్రీనివాస్ క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. ఎంపీడీవో సుశీల్‌రెడ్డి, ఎంపీవో జీవన్‌రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, పీఏసీ ఎస్ చైర్మన్ ప్రశాంత్, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

27న టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ పరీక్ష

ఎదులాపురం: టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ (లోయర్ గ్రేడ్) పరీక్ష ఈనెల 27న డీఈవో ప్రణీత ఓ ప్రకటనలో తెలిపారు. గత మే, జూన్‌లో 42 రోజుల సమ్మర్ ట్రెయినింగ్ కోర్సు పొందిన, ఫెయిలైన విద్యార్థులకు పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. ఇందుకు హైదరాబాద్, హన్మకొండ, నిజామాబాద్, నల్గొండ, కరీంనగర్ జిల్లాల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారని తెలిపారు.

తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యం

ఇచ్చోడ: తల్లి పాలతోనే బిడ్డకు ఆరోగ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉమారాణి అన్నారు. మండల కేంద్రంలోని 2,5,7 అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం గర్భిణులకు సాముహిక సీమంతాలు నిర్వహించారు.

తహసీల్దార్‌కు సన్మానం

గుడిహత్నూర్: తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన కవితారెడ్డిని మండల ఆదివాసీ సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. అధ్యక్షుడు కుమ్రం శంభు, సర్పంచులు లింగు, మహదు, సతీశ్ ఉన్నారు.

హైమస్ట్ లైట్లు ప్రారంభం

ఉట్నూర్‌రూరల్: మండలంలోని సుంగుగూడ గ్రామంలో ఏర్పాటు చేసిన హైమస్ట్ లైట్లను ఎంపీపీ జైవంత్‌రావు మంగళవారం ప్రారంభించారు. నాయకులు రషీద్, మోతీరాం, సత్తన్న, భగవంత్‌ఆరవు, లచ్చు, జవ్వాద్ అన్సారి పాల్గొన్నారు.

'దరఖాస్తుదారులు ఆందోళన వద్దు'

గుడిహత్నూర్: దరఖాస్తుదారులు ఆందోళన వద్దని బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ కరాడ్ బ్రహ్మానంద్ 'సాక్షి'కి ఫోను ద్వారా తెలిపారు. గృహలక్ష్మి పథకం కోసం ధ్రువపత్రాల కోసం దరఖాస్తుదారులు మండల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అయితే అర్హులకు పత్రాలు సకాలంలో అందించాలని ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్ అధికారులకు సూచించారని తెలిపారు. గడువు తేదీని ప్రభుత్వం పొడగించే అవకాశం లేకపోలేదని తెలిపారు.

నేటి నుంచి పూలే జీవిత చరిత్ర పుస్తకాలు

ఆదిలాబాద్‌రూరల్: మహాత్మ జ్యోతిబాపూలే దంపతుల జీవిత చరిత్రల పుస్తకాలను బుధవారం నుంచి పంపిణీ చేస్తారని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పెట్కులే ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని టీచర్స్ కాలనీలోరని సంఘం కార్యాలయంలో ఉచితంగా వీటిని అందిస్తారని పేర్కొన్నారు.

పశువులకు గాలికుంటు టీకాలు

ఇచ్చోడ: మండలంలోని దేవుల్‌నాయక్ తండాలో పశువైద్యాధికారి గోవింద్‌నాయక్ మంగళవారం పశువులకు గాలికుంటు టీకాలు వేశారు.

కాంగ్రెస్‌లో చేరికలు

ఉట్నూర్‌రూరల్: శాంతినగర్, మోమిన్‌పురకు చెందిన పలువురు యువకులు మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు పటేల్ వారికి కండువా కప్పారు.

ఆంక్షలు లేకుండా రూ.లక్ష ఆర్థికసాయం ఇవ్వాలి

ఎదులాపురం: రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీలకు అందించే రూ.లక్ష ఆర్థిక సాయాన్ని ఆంక్షలు లేకుండా అందించాలని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ఎండీ రఫిక్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. గతంలో జిల్లా వ్యాప్తంగా 6222 మంది మైనార్టీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారని, వాటికే ఇంకా మోక్షం లేదని పేర్కొన్నారు.

బోథ్ సీఐని కలిసిన ఆదివాసీ నాయకులు

బోథ్: బోథ్ సీఐగా బాధ్యతలు చేపట్టిన భీమేశ్‌ను మంగళవారం ఆదివాసీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించారు. అనంతరం ఆదివాసీ దినోత్సవం కార్యక్రమానికి ఆహ్వానించారు. నాయకులు సర్మేడి భీంరావ్, భోజన్న, శంకర్, రాజన్న, విశ్వేశ్వర్, శంకర్, గోపాల్, రాము, అమత్, లక్ష్మణ్, గంగయ్య ఉన్నారు.

గ్రామాల్లో 'గడప గడపకూ కాంగ్రెస్'

బోథ్: మండలం గొల్లాపూర్, పార్డి(బి) గ్రామాల్లో గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ నాయకుడు ఆడే గజేందర్ ఆ గ్రామాల్లో మంగళవారం పర్యటించి గ్రామస్తులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆదివాసీలను మోసం చేసిందని ఆరోపించారు. పోతారెడ్డి, రమేశ్, అనిల్, శేఖర్ తదితరులు ఉన్నారు.

పోస్టాఫీసులో అందుబాటులో జాతీయ జెండాలు

నార్నూర్: ఇంటింటా జెండా (హర్ ఘర్ తిరంగ 2.0) ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు పోస్టాఫీసుల్లో జాతీయ జెండాలు అందుబాటులో ఉంచుతున్నట్లు తపాలాశాఖ అధికారి సుజీత్‌కుమార్ అన్నారు. మండలంలో భీంపూర్ తపాలాశాఖ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. రూ.25లకు జాతీయ జెండాలు కొనుగోలు చేయవచ్చని తెలిపారు. బీపీఎం చంద్రశేఖర్, సిబ్బంది రాథోడ్ మనోజ్ ఉన్నారు.